అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

## రౌండ్ ది క్లాక్ పర్యవేక్షణ

- లక్షలాది భక్తులకు నిరంతరాయ విద్యుత్తు సరఫరా లక్ష్యం
- అంత్య పుష్కరాలకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి
- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

02



బుధవారం 20, మే 2026 సంపుటి :03 సంచిక :102 పేజీలు :05 వెల ₹5

# తప్పు చేస్తే మిల్లులు సీజ్

## ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ముంచొద్దు

- అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం
- గత ఎనిమిదేళ్ల దోపిడీ ఇక సాగదు
- కాంటా కాగానే ట్రక్ షీట్ ఇవ్వాల్సిందే
- రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వార్నింగ్
- కలెక్టర్ తో కలిసి రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ

02

**అక్షరదర్బార్, గణపురం, చిట్యాల :** ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి గణపురంలోని జానకిరామ్ రైస్ మిల్, చిట్యాల మండలం కైలాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం దిగుమతి జరుగుతున్నప్పటికీ రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తయిన వెంటనే రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వాలని, ఆలస్యం ఎందుకు జరుగుతోందని సంబంధిత అధికారులను ప్రశ్నించారు.





# కలెక్టర్ ఫైర్

- మ్యూజియం పనులు పూర్తి కాకపోవడంపై అసంతృప్తి
- సంబంధిత అధికారులపై ఆగ్రహం

02

సరస్వతి అంత్య పుష్కరాల పనుల్లో మిగిలిన పనులను బుధవారం వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాళేశ్వరంలో సరస్వతి ఘాట్, గోదావరి నది ఒడ్డు, టెంట్ సిటీ, మ్యూజియం తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, మిగిలిన పనులను బుధవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యూజియం పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమయానికి సిద్ధం చేయాలని, పరిశుభ్రత, భద్రత, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. –అక్షరదర్బార్, కాళేశ్వరం

# కారును ఢీకొన్న ఇసుక లారీ

- యువకుడు దుర్మరణం
- గిర్నిబావి వద్ద ఘటన

03





# ఏసీబీ వలలో పెద్ద తిమింగలం

## జలమండలి జీఎం లక్ష్మీ కుమార్ ఇళ్లపై దాడులు

రూ.1.10 కోట్ల నగదు, 2 కిలోల బంగారం, 9 కిలోల వెండి స్వాధీనం

మార్కెట్ విలువ ప్రకారం ఆయన ఆస్తులు రూ.100 కోట్లకు పైనే

03



# కలెక్టర్ ఫైర్

- మ్యూజియం పనులు పూర్తి కాకపోవడంపై అసంతృప్తి
- సంబంధిత అధికారులపై ఆగ్రహం

అక్షరదర్బార్, కాళేశ్వరం : సరస్వతి అంత్య పుష్కరాల పనుల్లో మిగిలిన పనులను బుధవారం వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాళేశ్వరంలో సరస్వతి ఘాట్, గోదావరి నది ఒడ్డు, టెంట్ సిటీ, మ్యూజియం తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, మిగిలిన పనులను బుధవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యూజియం పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమయానికి సిద్ధం చేయాలని, పరిశుభ్రత, భద్రత, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, డీఎస్పీ సూర్యనారాయణ, ఆర్డీఓ రవీందర్, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10 లీటర్ల గుడుంబాతో మహిళ అరెస్ట్

- ఎస్సై పోచంపల్లి సతీష్

అక్షర దర్బార్, చిట్యాల: ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను దొంగచాటుగా విక్రయిస్తున్న చిట్యాల మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన తీగల రమ్మను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ మంగళవారం తెలిపారు. నవాబ్‌పేట్ గ్రామ పరిసరాల్లో పోలీసులు క్రమంతప్పకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నిందితురాలు తీగల రమ 10 లీటర్ల గుడుంబాతో పట్టుబడిందని ఆయన వివరించారు. ఆమె వద్ద నుండి గుడుంబాను పూర్తిగా స్వాధీనం చేసుకొని తెలంగాణ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందని ఎస్సై పోచంపల్లి సతీష్ స్పష్టం చేశారు.



# తప్పు చేస్తే మిల్లులు సీజ్

- -ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ముంచొద్దు
- -అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం
- -గత ఎనిమిదేళ్ల దోపిడీ ఇక సాగదు
- -కాంటా కాగానే ట్రక్ షీట్ ఇవ్వాల్సిందే
- -రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వార్నింగ్
- -కలెక్టర్ తో కలిసి రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ



అక్షరదర్బార్, గణపురం, చిట్యాల : ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి గణపురం లోని జానకిరామ్ రైస్ మిల్, చిట్యాల మండలం కైలాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం దిగుమతి జరుగుతున్నప్పటికీ రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తయిన వెంటనే రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వాలని, ఆలస్యం ఎందుకు జరుగుతోందని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ట్రక్ షీట్‌లు ఇవ్వకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ముంచరాదని, ఇటువంటి చర్యల వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టమని, మిల్లులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే విధంగా పనిచేస్తే పూర్తి సహకారం ఉంటుందని, కానీ అక్రమాలను సహించబోమని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా జరుగుతున్న దోపిడీ పద్ధతులు ఇకపై కొనసాగకుండా తక్షణమే సరిచేసుకోవాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వడం తప్పనిసరి చేయాలని, దీనిపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. జిల్లాలో 90 శాతం మక్కలు కొనుగోలు పూర్తి అయిందని తెలిపారు. చిట్యాల మండలం తిరుమలాపూర్ లో మక్కలు రవాణా చేసేందుకు వెంటనే వాహనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాలు వస్తే రైతులు ఇబ్బందులు పడతారని కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ క్షేత్రస్థాయి తనిఖీల్లో కాంటా పూర్తికాగానే రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్ళీ ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రౌండ్ ది క్లాక్ పర్యవేక్షణ



- లక్షలాది భక్తులకు నిరంతరాయ విద్యుత్తు సరఫరా లక్ష్యం
- అంత్య పుష్కరాలకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి
- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ : ఈ నెల 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు అన్ని విద్యుత్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 330 ఎనిమిది మీటర్ల స్తంభాలు, 152 తొమ్మిది మీటర్ల స్తంభాలు, 8 పదకొండు మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 5 కిమీ 11 కేవీ లైన్, 12 కిమీ ఎల్‌టీ లైన్ వేయడం పూర్తయినట్లు వెల్లడించారు. మొత్తం 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

- పర్యవేక్షణకు..

నిరంతరాయ విద్యుత్ సరఫరా నిర్వహణ కోసం 16 కీలక ప్రాంతాల్లో 12 రోజుల పాటు రౌండ్ ది క్లాక్ పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. విధుల్లో 4 మంది డివిజనల్ ఇంజినీర్లు, 6 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు, 13 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 12 మంది సబ్ ఇంజినీర్లు, 13 మంది లైన్ ఇన్స్పెక్టర్లు, 9 మంది లైన్మెన్లు, 45 మంది అసిస్టెంట్ లైన్మెన్లు తదితర సిబ్బంది కలిపి మొత్తం 150 మంది విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమైన సందర్భంలో వెంటనే మార్పిడి చేయడానికి అదనపు స్పేర్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. దేవాలయం, టెంట్ సిటీ, వీఐపీ ఘాట్, మెయిన్ ఘాట్, హరిత హోటల్ తదితర కీలక ప్రాంతాలకు డబుల్ ఫీడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒక ఫీడర్‌లో అంతరాయం ఏర్పడినప్పటికీ మరో ఫీడర్ ద్వారా వెంటనే విద్యుత్ సరఫరా అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

### ప్రత్యేక బ్రేక్ డౌన్ బృందాలు

అలాగే బ్రేక్‌డౌన్ పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం కాళేశ్వరం, మహాదేవపూర్, 132 కేవీ కాటారం సబ్‌స్టేషన్ వద్ద ప్రత్యేక బ్రేక్‌డౌన్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. "పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం" అని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. పుష్కర ఘాట్లు, రహదారులు, పూజా మండపాల సమీపంలో ఎర్ర-తెలుపు రంగుల హెచ్చరిక టేపులు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ తీగలకు దగ్గరగా వెళ్లకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సీఎండీ విజ్ఞప్తి చేశారు.

# మేలు రకం విత్తనాలే అమ్మాలి

- విత్తన చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- నకిలీ విత్తనాల నియంత్రణకు ఎన్ఫోర్స్మెంట్ బృందాలు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, రైతులకు నాణ్యమైన విత్తనాలే అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి విత్తన కంపెనీల ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లతో విత్తన చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఆదిరెడ్డి విత్తన చట్టం, నిబంధనలు, డీలర్ల బాధ్యతలు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు మేలైన, ధృవీకరించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లాలో విత్తనాల కొరత లేకుండా సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విత్తన డీలర్లు ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విత్తనాల స్టాక్, విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దుకాణాల్లో విత్తనాల స్టాక్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు, రైతులకు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా బిల్లులు, రసీదులు ఇవ్వాలని తెలిపారు. వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని నకిలీ విత్తనాల నియంత్రణకు మండల, డివిజన్, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్లే విత్తనాల విక్రయాలు చేపట్టాలని, లైసెన్స్ గడువు ముగిసిన వారు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా విత్తనాల విక్రయం నిర్వహిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు సరైన విత్తనాల ఎంపికలో వ్యవసాయ విస్తరణ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, తెలంగాణ సీడ్స్ ఆర్ఎం శ్రీనివాస్, పోలీస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వివిధ విత్తన కంపెనీల ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు పాల్గొన్నారు.



# ఏసీబీ వలలో 'పెద్ద తిమింగలం'

- జలమండలి జీఎం లక్ష్మీ కుమార్ ఇళ్లపై దాడులు
- రూ.1.10 కోట్ల నగదు, 2 కిలోల బంగారం, 9 కిలోల వెండి స్వాధీనం
- మార్కెట్ విలువ ప్రకారం ఆయన ఆస్తులు రూ.100 కోట్లకు పైనే



అక్షరదర్బార్, హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల సంస్థ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) లో భారీ అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు చిక్కింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో రెడ్ హిల్స్ జలమండలి జనరల్ మేనేజర్ (ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ డివిజన్-VIII) సగ్గం అనంత లక్ష్మీ కుమార్ ఇళ్లు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీగా నగదు, కిలోల కొద్దీ బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.కోట్ల విలువైన స్థిరాస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు**

జలమండలి జీఎం లక్ష్మీ కుమార్ తన సర్వీసు కాలంలో అవినీతి, అక్రమ మార్గాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు మంగళవారం తెల్లవారుజామునే హైదరాబాద్ మల్లాపూర్‌లోని ఆయన నివాసంతో పాటు సికింద్రాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు ప్రారంభించాయి.

**లెక్కింపునకు కరెన్సీ మిషన్లు.. విస్తుపోయేలా ఆస్తులు**

సోదాల సందర్భంగా జీఎం నివాసంలో కుప్పలుతెప్పలుగా దొరికిన నోట్ల కట్టలను చూసి ఏసీబీ అధికారులే షాక్‌కు గురయ్యారు. ఆ నగదును లెక్కించడానికి ప్రత్యేకంగా కరెన్సీ లెక్కింపు మిషన్లను రప్పించారు. ఈ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న ప్రాథమిక వివరాల ప్రకారం సుమారు రూ.1.10 కోట్ల లిక్విడ్ క్యాష్. దాదాపు 2.1 కిలోల బంగారు నగలు, సుమారు 9.2 కిలోల వెండి సామాగ్రి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో 18 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో 6 ఓపెన్ ప్లాట్లు, 3 ఫ్లాట్లు, ఒక లగ్జరీ ఇల్లు ఉన్నట్లు దస్తావేజులు లభ్యమయ్యాయి. ఒక మారుతి రిట్జ్ కారు, ఒక బజాజ్ మోటార్ సైకిల్ కూడా స్వాధీనం చేసుకున్నారు.

**మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైనే**

అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం స్వాధీనం చేసుకున్న ఆస్తుల ప్రభుత్వ డాక్యుమెంట్ విలువ రూ.5.88 కోట్లుగా చూపించినప్పటికీ, వీటి ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ రూ.100 కోట్ల పైనే ఉంటుందని ఏసీబీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా కొన్ని బ్యాంక్ లాకర్లను తెరవాల్సి ఉందని, వాటిని కూడా పరిశీలిస్తే మరిన్ని అక్రమాస్తులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అవినీతి నిరోధక చట్టం కింద జీఎం కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు, ఈ సోదాలు కొనసాగుతాయని ఏసీబీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. జీఎం కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు. జలమండలిలో ఇంతటి భారీ స్థాయిలో అక్రమాస్తులు దొరకడం నగరంలో తీవ్ర సంచలనంగా మారింది.

# కారును ఢీకొన్న ఇసుక లారీ

- యువకుడు దుర్మరణం
- గిర్నిబావి వద్ద ఘటన




అక్షరదర్బార్, దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్ వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అతివేగంగా దూసుకొచ్చిన ఒక ఇసుక లారీ, కారును బలంగా ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గ పద్మానగర్ ప్రాంతానికి చెందిన వరుణ్ అనే యువకుడు తన వ్యక్తిగత పని నిమిత్తం కారులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్ వద్దకు చేరుకోగానే, ఎదురుగా వస్తున్న ఒక ఇసుక లారీ కారును అత్యంత వేగంగా, బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న వరుణ్ తీవ్ర రక్తస్రావమై, ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారైనట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న దుగ్గొండి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు కారులో ఇరుక్కుపోయిన వరుణ్ మృతదేహాన్ని పోలీసులు, స్థానికులు ఎంతో శ్రమించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

**- మిన్నంటిన రోదనలు**

వరుణ్ మరణవార్త తెలియడంతో కాశిబుగ్గ పద్మానగర్‌లోని అతని కుటుంబంలో ఒక్కసారిగా చీకట్లు ముసిరాయి. చేతికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లాడనే విషయం తెలిసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఇసుక లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుగ్గొండి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పంట అవశేషాల పొగతో ఘోర ప్రమాదం

- నడికూడ యువకుడు క్రాంతికుమార్ మృతి

**రైతుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం.. కఠిన చర్యలకు డిమాండ్**




అక్షరదర్బార్, నడికూడ: పొలాల్లో పంట అవశేషాలను నిర్లక్ష్యంగా తగలబెట్టడం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న విషాద ఘటన నడికూడ మండలం రామకృష్ణాపూర్-కంటాత్మకూర్ గ్రామాల మధ్య చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. నడికూడ మండల కేంద్రానికి చెందిన ఆకారపు క్రాంతికుమార్ హనుమకొండ నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలో రైతులు కాల్చిన పంట అవశేషాల నుండి వచ్చిన దట్టమైన పొగ రోడ్డంతా పూర్తిగా కమ్మేసింది. ఈ క్రమంలో దారి కనిపించక క్రాంతికుమార్ తీవ్ర ప్రమాదానికి గురై మృతి చెందాడు. అయితే క్రాంతికుమార్‌ను పొగ కారణంగా ఏదైనా వాహనం ఢీకొట్టిందా లేక అదుపుతప్పి కింద పడ్డాడా అన్నది తెలియాల్సి ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రైతుల అలసత్వమే ఈ ప్రమాదానికి కారణమని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# సూరంపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**భూసార రక్షణకు పచ్చిరొట్ట ఎరువులు వాడాలి**

**అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. రాజు**

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం సూరంపేట గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. రాజు మాట్లాడుతూ రైతులు రసాయనిక యూరియా వాడకాన్ని తగ్గించి, పచ్చిరొట్టె ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ పొలంలో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం కీటక విభాగ నిపుణురాలు డాక్టర్ ఎన్. రమ్యశ్రీ మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ చర్యలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూరం శశిపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఏఈఓ రాకేష్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కల్తీ విత్తనాలపై ఉక్కుపాదం వేయాలి

○ రైతు రక్షణ సమితి

○ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేత

అక్షరదర్బార్, పరకాల: రానున్న ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు కల్తీ విత్తనాల వల్ల ఎలాంటి మోసం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్‌రావు మాట్లాడుతూ.. విత్తన దుకాణాలపై వ్యవసాయ అధికారులు నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, లైసెన్స్ లేని అక్రమ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు నకిలీ విత్తనాల వల్ల జరిగే నష్టాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ పాల్గొన్నారు.

## గాంధీనగర్‌ను ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించాలి

○ విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.జీలుకర శ్రీనివాస్ డిమాండ్

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలంలోని జోలపేట గ్రామ శివారులో గల గాంధీనగర్ దళిత కాలనీని ప్రత్యేక గ్రామపంచాయతీగా మార్చాలని విముక్త చిరుతల పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ కాలనీలో 'దళిత గ్రామ పంచాయతీ ఉద్యమ బహిరంగ సభ' వీసీకే యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అత్యంత వెనుకబడి దుర్భర జీవితాలు గడుపుతున్న దళితులు బాగుపడాలంటే దళిత కాలనీలన్నింటినీ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఊరికి దూరంగా ఉన్న గాంధీనగర్ కాలనీని తక్షణమే గ్రామ పంచాయతీ చేయాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సభలో వర్కింగ్ ప్రెసిడెంట్ చెరిపల్లి ఆనంద్, భూపాలపల్లి జిల్లా నాయకులు మహేష్, అడ్వకేట్ బిక్షపతి, ఎమ్మార్పీయెస్ జనగాం జిల్లా నాయకుడు వంగాల సోమయ్యలతో పాటు గాంధీనగర్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ద్వంద్వ విధుల్లోనూ 'బడిబాట'

అక్షరదర్బార్, నడికూడ: ఒకవైపు జనాభా గణన (సెన్సస్) ప్రభుత్వ విధులు నిర్వహిస్తూనే, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తూ నడికూడ మండలం ముస్త్యాలపల్లి ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పిల్లల నమోదు శాతాన్ని పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులు, సర్పంచ్ కలిసి ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తున్నారు. కూలి పనులు చేసే ప్రాంతాలు, వ్యవసాయ పొలాల వద్దకు నేరుగా వెళ్లి సర్కారు బడిలో లభించే ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన సదుపాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం) కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పావని, సత్యపాల్, పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ పాల్గొన్నారు.

# పారదర్శకంగా జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల జారీ

○ కలెక్టర్ బోర్ఖడే హేమంత్

అక్షర దర్బార్, ములుగు: ములుగు జిల్లాలో అక్రెడిటేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అక్రిడికేషన్ దరఖాస్తులను కమిటీ నిశితంగా పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, అక్రెడిటేషన్ మార్గదర్శకాలకు నూతనంగా విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు కార్డు అందేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని



సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్, డీఎంఏసీ కమిటీ సభ్యులు ఎం.డి. షఫీ అహ్మద్, గడ్డం దేవేందర్, బి. పృథ్వీరాజ్, బండారి లక్ష్మణ్, ఎం.డి. అబ్దుల్ గఫార్, చుంచు రవి, కే. రాజేష్, వడ్లకొండ వీరయ్య, బి.అశోక్, జూనియర్ అసిస్టెంట్ కొత్తపల్లి శంకర్ పాల్గొన్నారు.

## రాజనీతి శాస్త్రంలో చీకటి కుమారస్వామికి కేయూ డాక్టరేట్



అక్షరదర్బార్, హనుమకొండ: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం పరిశోధకుడు చీకటి కుమారస్వామి రాజనీతి శాస్త్రంలో ప్రతిష్టాత్మక డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ మంగళవారం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. కుమారస్వామి "రోల్ ఆఫ్ రీజినల్ పొలిటికల్ పార్టీస్ ఇన్ ఇండియా విత్ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్" అనే కీలక అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి గాను ఈ డాక్టరేట్ లభించింది. కేయూ రాజనీతి శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రన్ పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి ఇప్పటికే ఐదు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధన పత్రాలను ప్రచురించారు. సిద్ధాపూర్, సీకేఎం, ఎల్బీ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ఆయన కాకతీయ యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో ఎంఏ పట్టా పొందారు. వరంగల్ తాళ్ల పద్మావతి కళాశాలలో బి.ఎడ్ పూర్తి చేసిన ఆయన, ఎంఫిల్ ప్రవేశ పరీక్షల్లో యూనివర్సిటీ స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. ప్రస్తుతం హనుమకొండలోని శ్రీ మేధావి జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహించుచున్న కుమారస్వామిని ఆయన తల్లిదండ్రులు రామచంద్రం, వీరలక్ష్మి, అధ్యాపకులు, మిత్రులు మరియు గ్రామస్థులు ఘనంగా అభినందించారు.

## ఎండ తీవ్రత, ఫేస్ యాప్ నిబంధనలతో ఉపాధి కూలీల అవస్థలు

**వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోయిన కూలీ సమ్మయ్య**

అక్షర దర్బార్, శాయంపేట: ఉపాధి హామీ పథకంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ అటెండెన్స్ (ఫొటో) విధానం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశంలో ఉదయం మొదటి ఫొటో తీసిన నాలుగు గంటల తర్వాతే యాప్‌లో రెండోసారి ఫొటో తీసే నిబంధన ఉండటంతో మండుటెండల్లో కూలీలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. శాయంపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఉపాధి కూలీ సమ్మయ్యతో పాటు మరొకరు ఉపాధిహామీ పని ముగించుకుని, తీవ్రమైన వడగాలులతో కూడిన ఎండలో ఇంటికి వస్తూ మార్గమధ్యంలో సొమ్మసిల్లి కింద పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారికి ప్రథమ చికిత్స అందించి ఉపశమనం కల్పించడంతో కొద్దిసేపటికి కోలుకున్నారు. ఈ ఆలస్యం వల్ల కూలీల సంఖ్య కూడా తగ్గుతోందని, ఎండ తీవ్రత దృష్ట్యా ఫేస్ యాప్ ఫొటోల విషయంలో వెసులుబాటు కల్పించాలని ఉపాధి కార్మికులు ఆవేదనతో కోరుతున్నారు.

## బీజేపీ బూత్ అధ్యక్షుడు బాసాని నవీన్ తండ్రి భిక్షపతి మృతికి కీర్తి రెడ్డి నివాళి

అక్షర దర్బార్, శాయంపేట: భారతీయ జనతా పార్టీ శాయంపేట బూత్ అధ్యక్షుడు బాసాని నవీన్ తండ్రి బాసాని బిక్షపతి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి సత్యపాల్ రెడ్డి శాయంపేటలోని నివాసానికి చేరుకుని బిక్షపతి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కష్టసమయంలో బాసాని నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, సీనియర్ నాయకులు బాసాని విద్యాసాగర్, వనం దేవరాజ్, ఉప్పు రాజు, కోమటి రాజశేఖర్, కోడెపాక సంజీవరావు, కడారి చంద్రమౌళి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

### బాసని అన్వితకు రవీంద్రభారతిలో

## ఘనంగా ప్రతిభా పురస్కారం

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించడం గర్వకారణం: ఎమ్మెల్సీ కోదండరామ్**

అక్షర దర్బార్, శాయంపేట: పదో తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను ఘనంగా అందజేశారు. శాయంపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల మండల టాపర్ బాసని అన్వితను రవీంద్ర భారతిలో జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు సహజ తత్వం ఎక్కువగా ఉంటుందని, వారు సమాజంలో సులభంగా సర్దుకుపోతూ సొంతంగా ఎదిగే స్వభావాన్ని కలిగి ఉంటారని కొనియాడారు. ప్రభుత్వ బడి పిల్లలను ఇలా సన్మానించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత శాంతికృష్ణ, ఐ ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్, సామల వేణు, గంప వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అమర్‌నాథ్, డాక్టర్ గోపాలకృష్ణ మరియు తెలంగాణ విటల్ సేవా సమితి ప్రతినిధులు, 33 జిల్లాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

